## టార్గెట్ బాల్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 1 : వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో టార్గెట్ బాల్ పోటీల్లో లిటిల్ స్టార్ పాఠశాల విద్యార్థులు ప్రగతి వాడ్కర్, సాయికీర్తి, సిద్ధార్థ సోన్ కాంబ్లే ప్రతిభ కనబర్చారు. మహారాష్ట్రలోని షిర్డీలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలో వీరు పాల్గొంటారు. లిటిల్ స్టార్ ప్రిన్సిపాల్ కమలాకర్ రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ ప్రెసిడెంట్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, పేట ప్రెసిడెంట్ పార్థసారథి, టార్గెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ స్వామి, వీజీఎస్ రాకేశ్, లిటిల్ స్టార్ పాఠశాల పీఈటీలు రాహుల్ అగర్కర్, డీ మహేశ్ ప్రోత్సాహం తోవిద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.


గెలుపొందిన విద్యార్థులు

## ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులు సత్తా చాటాలి

ఉట్నూర్, అక్టోబర్ 1 : ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులు సత్తా చాటాలని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ అన్నారు. ఉట్నూర్‌లోని ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో మై డ్రీమ్స్ కం టూ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం హ్యాపీ జిందగీ మోటివేషనల్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి తనపై పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. విద్యార్థి దశనుంచే తల్లిదండ్రులు, గురువులను గౌరవించి, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దాబడాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కుమ్ర సాయి కృష్ణ, మాణిక్‌రావ్, మాదాసు మధుకర్, వినయ్, నగేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్

## అదుపు తప్పి కంటైనర్ బోల్తా


బోల్తా పడిన కంటైనర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 1 : మావల మండలంలోని జాతీయ రహదారిపై కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు కొరియర్‌తో వెళ్తున్న కంటైనర్ దేవాపూర్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ సమీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న 108 వాహన ఈఎంటీ కిషన్, పైలెట్ ముజాఫర్ క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

## యువతి ఆత్మహత్య

బజార్‌హత్నూర్ అక్టోబర్ 1 : బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మేకల నరేశ్ అదే గ్రామానికి చెందిన కడవేని శిరీష(23)ను శనివారం రాత్రి పెళ్లి చేసుకోమని వేధించడంతో ఆ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నరేశ్ వివరాల ప్రకారం.. పిప్పిరి గ్రామానికి చెందిన కడవేని శ్రీనివాస్, సత్తమ్మల చిన్న కూతురు శిరీష డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నది. అదే గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మేకల నరేశ్ ఏడు నెలల నుంచి పెళ్లి చేసుకోమని ఫోన్‌లో శిరీషను వేధిస్తున్నాడు. ఇదే విషయం కుటుంబ సభ్యులకు తెలపడంతో ఆమె అన్న సతీశ్ నరేశ్‌ను మందలించాడు. అయిన వేధింపులు ఎక్కువ కావడంతో తన ఫోన్ నంబర్‌ను మార్చింది. గత వారం సెలవుపై గ్రామానికి వచ్చిన నరేశ్ ఆమె కొత్త ఫోన్ నంబర్‌కు శనివారం రాత్రి మళ్లీ ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని వేధించడంతో ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి పురుగుల మందు తాగింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శిరీషను ఆటోలో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


శిరీష (ఫైల్)

# స్వచ్ఛతను పాటిద్దాం

- ముున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్
- ఊరూరా స్వచ్ఛత పక్షోత్సవాలు



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 1 : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బేల, అక్టోబర్ 1 : వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీటీసీ పవార్ అక్షిత సూచించారు. చందపెల్లి గ్రామంలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ జంగ్‌శావ్, తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

బేల, అక్టోబర్ 1 : పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం శ్యామల అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వృత్తి నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారిచే నిర్వహించబడుతున్న జన శిక్షణ సంస్థ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు నేర్చుకుంటున్న మహిళలచే స్వచ్ఛత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి కళాశాల ఆవరణను శుభ్రం చేయించారు. ఇంటి చుట్టూ మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ చెన్నాల రాజన్న, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోష్, ఫీల్డ్ ఆఫీసర్ రాజు, సంస్థ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

### రైల్వే శాఖ ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 1 : ఆదిలాబాద్‌లోని రైల్వే స్టేషన్‌లో రైల్వే శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఆవరణతో పాటు రైళ్లలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, అధికారులు రఘురాం, శివరాం, రాంబాబు, రవికుమార్, రజితేజ, జడ్పీమాజీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.


బేల: చంద్‌పెల్లిలో పరిసరాలు శుభ్రం చేస్తున్న జడ్పీటీసీ పవార్ అక్షిత

ఉట్నూర్, అక్టోబర్ 1 : ఉట్నూర్‌లోని రాంమందిర్ ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, కార్మికులు, కాలనీవాసులు ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్ పంచాయతీ ఈవో శంకర్, కార్మికులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌రూరల్: శ్యాంపూర్‌లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్, గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 1: మండలంలోని ఘన్‌పూర్‌లో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, సర్పంచ్, గ్రామస్తులు రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా శ్యాంపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, గ్రామస్తులు పిచ్చిమొక్కలు తొలగించారు. పులిమడుగు గ్రామంలో సర్పంచ్ సరిత వీధులను ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ సర్పంచ్ పంద్ర లత, శ్యాంపూర్ సర్పంచ్ మల్లిక, పీహెచ్‌సీ డాక్టర్ రాథోడ్ సందీప్, పంచాయితీ కార్యదర్శులు, గ్రామస్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నార్నూర్: మాన్కాపూర్‌లో ర్యాలీ తీస్తున్న పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు


నార్నూర్: గాదిగూడ మండలం ఖండోలో శ్రమదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

### శుభ్రతతో ఆరోగ్యకరమైన జీవనం

నార్నూర్, అక్టోబర్1 : శుభ్రతతో ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చని పంచాయతీ కార్యదర్శి లవ్‌కుమార్ అన్నారు. నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామంలో గ్రామస్తులు, నాయకులు, విద్యార్థులు శుభ్రతపై అవగాహన ర్యాలీ తీశారు. రోడ్లపై చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.అలాగే గాదిగూడ మండలం ఖండో గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఖండో ఎంపీటీసీ కిరణ్, సర్పంచ్ చంద్రహరి, ఉపసర్పంచ్ రాయిసిడాం రూప్‌దేవ్, మాజీఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, అంగన్‌వాడీ టీచర్ కమల, విద్యార్థులు పాల్గొన్నారు.

### పట్నాపూర్‌లో..

బోథ్, అక్టోబర్ 1: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ, ఏఈవో శ్యాం, వార్డు సభ్యులు ఆత్రం మోహన్, సెక్రటరీ మిథున్ గోవింద్, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, శోభ, ఐకేపీ సీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉట్నూర్‌రూరల్: ఘన్‌పూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, గ్రామస్తులు

## 4న ఆత్మ గౌరవ సభ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 1 : సికింద్రాబాద్‌లోని దోబీఘాట్ గ్రౌండ్‌లో ఎస్సీ 57 కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించే ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమితి నేతలతో కలిసి ఆత్మ గౌరవ సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## బాలుడిపై వీధి కుక్క దాడి

తలమడుగు, అక్టోబర్ 1 : మండల కేంద్రానికి చెందిన సిద్దుల రిత్విక్(6) బాలుడిపై ఆదివారం సాయంత్రం వీధి కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. రోడ్డుపైన ఆడుకునే సమయంలో కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స చేసి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.